ప్రజాశక్తి
మంగళవారం 26 మార్చి, 2024
5
శ్రీకాకుళం



మెరిట్ జాబితా విడుదల

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2024-25కు గాను ఐదో తరగతి ప్రవేశ పరీక్ష రాసిన ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటించామని జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్.బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థులు పొందిన మార్కులు, సీట్ల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర అధికారులు ఎంపిక జాబితా రూపొందించారని పేర్కొన్నారు. జిల్లాలో 8 అంబేద్కర్ గురుకులాల్లో ఐదో తరగతిలో 640 సీట్లకోసం 640 మంది విద్యార్థులను ఎంపిక చేశామని అన్నారు. దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్లకు సమాచారం అందించామని వెల్లడించారు. అలాగే వెబ్‌సైట్‌లో కూడా అంటుబాటులో ఉంచామన్నారు. అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసుకుని అడ్మిషనకు కావాల్సిన పత్రాలను ఏప్రిల్ 6లోగా ఆయా గురుకులాల్లో అందజేయాలని స్పష్టంచేశారు. గడువులోగా అడ్మిషన్ పొందకుంటే, సీట్లను మెరిట్ లిస్ట్‌లోని తరువాత విద్యార్థులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో తల్లిదండ్రులు ఆప్షన్ ఇచ్చిన గురుకులాల్లోనే సీట్లు కేటాయించారని అన్నారు.

టిక్కెట్లు... ఇక్కట్లు

- రెండు చోట్ల కొత్త అభ్యర్థులకు టిడిపి సీట్లు
- వేచి చూసే ధోరణిలో ఇన్‌ఛార్జీలు
- ఎన్నికల్లో సహకారంపై సందేహమే
- ఎంపీ సీటుపై పడనున్న ప్రభావం

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ సీట్లలో టిడిపి మూడు విడతల్లో కలిపి ఏడు చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. జిల్లాకు సంబంధించి ఎచ్చెర్ల సీటును ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ స్థానాన్ని బిజెపికి కేటాయించినట్లు సమాచారం. తొలి రెండు జాబితాలు ఇబ్బంది కలిగించకపోయినా, తాజాగా మూడో జాబితా మాత్రం అసంతృప్తి జ్వాలలను రాజేసింది. శ్రీకాకుళం, పాతపట్నం స్థానాల్లో కొత్త అభ్యర్థుల ప్రకటన పార్టీలో చిచ్చురేపింది. సీనియర్లను పక్కన పెట్టడం, ప్రత్యేకించి గుండ కుటుంబంపై ఉన్న సానుభూతితో టిడిపిపై ప్రజల్లో కొంత విముఖత కనిపిస్తోంది. దీంతో ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మునుపు టిడిపిలో ఉన్న ఊపు కాస్తా తగ్గడంతో పార్టీ శ్రేణులు కలవరపడుతున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి ఈ నెల 22న ప్రకటించిన మూడో జాబితాలో మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. అందులో రెండు చోట్ల మార్పులు చేసింది. ఇప్పుడు ఆ మార్పులే టిడిపికి చేటు తెచ్చేలా కనిపిస్తున్నాయి. పలాస స్థానానికి గౌతు శిరీష పేరును ఖరారు చేయగా, శ్రీకాకుళానికి గొండు శంకర్‌కు, పాతపట్నం సీటును మామిడి గోవిందరావుకు కేటాయించింది. ఈ రెండు స్థానాల్లో పార్టీ ఇన్‌చార్జీలుగా ఉన్న గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణకు పార్టీ మొండి చేయిచూపింది. ఈ రెండు నియోజకవర్గాలకూ చాలా అంశాల్లో సారుప్యం కనిపిస్తోంది. పార్టీ ఓటమి తర్వాత 2019 నుంచి పార్టీ బాధ్యతలను చూస్తున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి (ఫైల్)

పార్టీ ఇచ్చిన పిలుపుల మేరకు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు, చంద్రబాబు, లోకేష్ సభల నిర్వహణ వంటి ఖర్చులను వారే భరించారు. సూపర్ సిక్స్ పథకం పేరుతో ఇంటింటికీ వెళ్లారు. చంద్రబాబు అరెస్టు తర్వాత వీరి ఆధ్వర్యాన్న రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

టిక్కెట్ల కేటాయింపు దగ్గరకొచ్చేసరికి అధిష్టానం ఆ కార్యక్రమాలతో సంబంధంలేని కొత్త వారికి కేటాయించడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇన్‌ఛార్జీలు కొంత వేచి చూసే ధోరణి ప్రదర్శిస్తున్నా... కార్యకర్తలు మాత్రం తగ్గేదేలా అన్నట్లు ఉన్నారు. ఇండిపెండెంట్లుగా పోటీ చేయాలని ఇన్‌ఛార్జీలపై ఒత్తిడి తెస్తున్నారు. డొనేషన్లు వేసుకునైనా గెలిపించుకుంటామని నాయకులకు అండగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు.

ఎన్నికల ఖర్చుకు వెనుకడుగు వేసేనందుకేనా?

ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో రెండు చోట్ల ఇన్‌ఛార్జీలకు టిక్కెట్లు దక్కకపోవడమే ఒక ఉదాహరణ. టిక్కెట్ల ప్రకటనకు ముందుకు గుండ నివాసానికి వచ్చిన టిడిపి పరిశీలకుడొకరు ఎంత ఖర్చు చేయగలరని లక్ష్మీదేవిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఆమె ఒక అంకె చెప్పి అంతకుమించి తాను వెచ్చించలేనని చెప్పడంతో ఆ వ్యక్తి అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. తర్వాత విడుదలైన జాబితాలో ఆమె పేరు లేదు. ఇదే అనుభవం పాతపట్నం ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణకు ఎదురైంది. ఆయన కూడా ఏదో నంబరు చెప్పగా, చాలదని చెప్పినట్లు తెలిసింది. తర్వాత ఆయన పేరూ లేదు.

టిడిపికి చేటు తెచ్చిన ఐవిఆర్ఎస్ సర్వే

అభ్యర్థుల ప్రకటన విషయంలో చంద్రబాబు ప్రధానంగా ఐవిఆర్‌ఎస్ సర్వేనే నమ్ముకున్నట్లు తెలిసింది. ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని ఒకట్రెండు సార్లు చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ సర్వేనే టిడిపి దెబ్బతీసేలా కనిపిస్తోంది. టిడిపి చేపట్టిన సర్వే వైసిపి కేడర్‌కూ చేరింది. టిడిపి నుంచి ఎవరు పోటీ పడితే తాము తేలిగ్గా గెలవగలమో గుర్తించి వారికే ప్రాధాన్యమిచ్చారు. దీంతో శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో గొండు శంకర్, మామిడి గోవిందరావుకు సర్వేలో అధిక శాతం మంది ప్రాధాన్యమివ్వడంతో వారికే సీట్లు కేటాయించినట్లు చర్చ నడుస్తోంది.

అచ్చెన్న రాజకీయ క్రీడ

టిక్కెట్ల కేటాయింపులో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆడిన రాజకీయ క్రీడ వల్లే తమకు సీట్లు రాలేదని ఇన్‌ఛార్జీలు బహిరంగానే ఆరోపణలు చేస్తున్నారు. తమ కుటుంబాన్ని రాజకీయంగా అణగదొక్కాలని చాలాకాలం నుంచి అచ్చెన్నాయుడు ప్రయత్నిస్తున్నారని గుండ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో అసమ్మతిని రాజేసి చివరకు టిక్కెట్ రాకుండా అడ్డుకున్నారని మండిపడుతున్నారు. పాతపట్నంలో కలమట వెంకటరమణకు టిక్కెట్ దక్కకుండా అచ్చెన్నాయుడు చేశారంటూ కార్యకర్తలు మండిపడుతున్నారు.

ఎంపీ సీటుపై ప్రభావం

జిల్లాలో రెండు చోట్ల అభ్యర్థుల మార్పుతో శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న కింజరాపు రామ్మోహన్‌నాయుడుపై పడనుందనే చర్చ నడస్తోంది. ఇండిపెండెంట్లుగా పోటీచేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జీలపై కార్యకర్తలు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఇన్‌ఛార్జీలు మాత్రం దింపుడు కళ్లెం ఆశతో ఉన్నారు. చివరి క్షణంలోనైనా తమకు బి-ఫారమ్ దక్కొచ్చని అనుకుంటున్నారు. నిర్ణయం మార్చుకోవాలంటూ పార్టీ అధిష్టానానికి కొంత సమయం ఇచ్చారు. అభ్యర్థులు వారే ఫైనల్ అయితే మాత్రం ఈ రెండు నియోజకవర్గాల్లో టిడిపికి ఓటమి తప్పదని చర్చ నడుస్తోంది.

ఇండిపెండెంట్లుగా పోటీచేస్తే టిడిపి ఓట్లు భారీగా చీలే అవకాశం కనిపిస్తోంది. ఇండిపెండెంట్లుగా పోటీ చేయకుండా తటస్థంగా ఉన్నా నష్టం తప్పేలా లేదు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వల్లే తమ నేతలకు టిక్కెట్ రాలేదనే కోపంతో ఉన్న ఆ రెండు నియోజకవర్గాలోని పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు ఎంపీ అభ్యర్థినీ వ్యతిరేకించే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కడానికి టిడిపి ఎటువంటి దిద్దుబాటు చర్యలు చేపట్టనుందో వేచి చూడాల్సి ఉంది.



కొత్తూరు : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

పకడ్బందీగా 'మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్'

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, ఆమదాలవలస

సాధారణ ఎన్నికల దృష్ట్యా మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్‌ను పకడ్బందీగా, పటిష్టంగా అమలు చేయడంపై దృష్టి సారించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో సోమవారం పర్యటించారు. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. పర్యటనలో భాగంగా కొత్తూరు నియోజకవర్గ ఆర్ఓతో కలిసి కర్లెమ్మ అంతర్ జిల్లా చెక్‌పోస్టును, హిరమండలం, ఎల్ఎన్‌పేటలో పోలింగ్ స్టేషన్ సందర్శించి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. అలాగే ఆమదాలవలస మండలం కృష్ణాపురం వద్ద ఎఫ్ఎస్‌టి బృందాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 16 నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ అమల్లోకి వచ్చిందని అన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని అన్నారు. అనంతరం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారని తెలిపారు. షెడ్యూల్ విడుదల నుంచి నోటిఫికేషన్ వరకు మధ్యనున్న సమయంలో ఎంసిసి అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎంసిసి సంబంధించి ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ భవనాల్లో పోస్టర్లు, వాల్ రైటింగ్స్, బ్యానర్లు, హోర్డింగ్‌లు అన్ని మొదటి 24, 48 గంటల్లోనే తొలగించామని అన్నారు. జిల్లాలో ఎంసిసి అమలుపై అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇవిఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి చేసి సిద్ధంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ప్రతి నియోజకవర్గంలోని ఆర్ఒల హెడ్ క్వార్టర్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలూ అవి పని చేస్తాయన్నారు. ఎంసిసికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీ విజిల్ యాప్ నుంచి వచ్చిన ఫిర్యాదులు వంద నిమిషాలలోపు పరిష్కరిస్తామని అన్నారు.

1950 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు ఇచ్చినా 24 గంటల లోపు విచారణ చేసి పరిష్కరిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయని, వాలంటీర్లు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, కొందరిని తొలగించామని స్పష్టం చేశారు. ఎవరూ ఎలాంటి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని జిఒ విడుదల చేశామన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఎఫ్ఎస్‌టీలు, ఎంసిసి, విఎస్‌టి టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. మద్యం, డబ్బు, ఇతర వస్తువుల అక్రమ రవాణా దృష్టిసారించామన్నారు. జిల్లాలో పకడ్బందీగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈయన వెంట తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

నేడు భవిష్యత్ నిర్ణయం

మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : తెలుగుదేశం పార్టీ టిక్కెట్టు దక్కని గుండ కుటుంబం తమ భవిష్యత్ కార్యాచరణను మంగళవారం ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్టు మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు చెప్పారు. నగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్‌ల టిడిపి ఇన్‌ఛార్జీలు, నగరానికి చెందిన ముఖ్య నాయకులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డామని అన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో 53 రోజుల పాటు నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరంతరాయంగా శ్రమించామని చెప్పారు. అయినా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తనకు టిక్కెటు రాకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో అసమ్మతి వాదిగా ఉన్న వ్యక్తిని ప్రోత్సహించి టిక్కెట్టు ఇవ్వడం బాధ కలిగిందన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు, ప్రజలు ఇప్పుడు వారి వెంట నడిచేందుకు సిద్ధంగా లేరని తెలిసి కూడా పార్టీకి నష్టం చేకూర్చే చర్యలను ప్రోత్సహించి అసమ్మతివాదికి టిక్కెట్టు ఇచ్చారని వాపోయారు. అటువంటి వ్యక్తి వెంట ఎలా నడవాల్లో కార్యకర్తలే చెప్పాలన్నారు. కార్యకర్తలు, అభిమానులతో చర్చించి భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటించనున్నట్టు తెలిపారు. సమావేశంలో నగర టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణం, జామి భీమశంకరరావు, తోణంగి వెంకన్న యాదవ్, ఉంగటి రమణ, విభూది సూరిబాబు పాల్గొన్నారు.

హోలీ.. ఆనందకేళి...



పాతపట్నం : హోలీ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలు ప్రజలు సాంప్రదాయబద్ధంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, యువతీ యువకులు పరస్పరం రంగులు జల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ పండగను జరుపుకున్నారు. శ్రీకాకుళం నగరంలో గాయత్రి అపార్ట్‌మెంట్, హడ్కో కాలనీ, బలగ ప్రాంతాల్లో, వీధుల్లో రంగులు జల్లుకుని ఆనందంగా గడిపారు. ప్రతిఒక్కరి జీవితాల్లో రంగులు నిండాలని కోరుకున్నారు. పలుచోట్ల ఆటపాటలతో కేరింతలు కొట్టారు. పలాస మండలంలోని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో హోలీ సందర్భంగా రంగులు పూసుకుని ఆనందంగా సంబరాలు నిర్వహించారు. పాతపట్నం మండలం అచ్యుతాపురంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో కలిసి ఎమ్మెల్యే రెడ్డి శాంతి హోలీ వేడుకలను జరుపుకుంటూ రంగులు జల్లుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రదీప్, ఎమ్మెల్యే కుమారులు శ్రవణ్‌కుమార్, ఓం కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలో ఉదయం నుంచి యువత, మహిళలు, చిన్నారులు కేరింతలు కొడుతూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. క్రీడా మైదానంలో వాకర్స్, క్రీడాకారులు రంగులు వేసుకొని హోలీ వేడుకలు నిర్వహించారు. టెక్కలి పట్టణంలో పలు వీధుల్లో చిన్నారులు, యువత కేరింతలు కొడుతూ రంగులు పూసుకుని హోలీ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా సందడి చేశారు. కొత్తూరులో చోడవరపు వీధి, కుమ్మరడి వీధి, పెద్దవీధి, పడాలవీధి, దేవరవీధి, రెల్లివీధిల్లో చిన్నారులు ఉత్సాహంగా... ఉల్లాసంగా ఒకరిపై ఒకరు రంగులను జల్లుకుని ఆనందంగా హోలీ జరుపుకున్నారు.

హోలీ పండుగ సందర్భంగా నాగావళి నది ఒడ్డున ఉన్న పొన్నాడ మెట్టపై ఇస్కాన్ మందిరంలో డాక్టర్ రఘుపాత్రున్ శ్రీకాంత్ శిష్య బృందం తృత్య రూపకాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రదర్శన అనంతరం మందిరం కమిటీ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ నత్య ప్రదర్శనలో శిష్యులు నేహా, వర్షిత, చాందినీ, లలిత, హర్షిత, శ్రేయస్రి, సుషమ, ప్రణవి, కలేజ్ఞా, నేహా, ప్రణీత, సిరి నేహా, శ్రీలక్ష్మి, శశి ప్రియ, దుహిత పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : నృత్యం చేస్తున్న నృత్య కళాకారులు



ఇచ్ఛాపురం : హోలీ వేడుకలో కేరింతలు కొడుతున్న యువకులు



టెక్కలి రూరల్ : రంగులు పూసుకున్న యువకులు



కొత్తూరు : రంగులు జల్లుకుంటున్న చిన్నారులు

ఎన్నికల అక్రమాలకు 'సి-విజిల్' చెక్

యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. అయిదేళ్లకు ఒకసారి నిర్వహించే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు అక్రమాలు, ప్రలోభాలకు తెరతీసి గెలుపు కోసం ఎన్నో ప్రయత్నాలు సాగిస్తుంటారు. వాటిని అడ్డుకునేందుకు ఎన్నికల సంఘం చేసే ప్రయత్నాలు కత్తిమీద సామే అవుతున్నాయి. ఎన్ని రకాలుగా అడ్డుకట్ట వేయాలని ప్రయత్నించినా ఏదో ఒక రూపంలో వారు అనుకున్న రీతిలో ప్రలోభాలకు పెద్దఎత్తున పాల్పడుతూనే ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల సంఘం సాంకేతికను వినియోగిస్తూ అక్రమాలను, ప్రలోభాలను అడ్డుకోవాలని యోచిస్తోంది. నిబంధనల సక్రమ అమలుకు ప్రజల భాగస్వామ్యం తీసుకుంటోంది. ఐదేళ్ల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎన్నికల్లో జరిగే ఎలాంటి ఉల్లంఘనలైనా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే యంత్రాంగం చర్యలకు ఉపక్రమిస్తారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ఉన్న వారు ప్లే స్టోర్ నుంచి సీ విజిల్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా సులభంగానే ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్‌లో యాప్ డైన్‌లోడ్ చేసుకున్న తర్వాత లొకేషన్ ఆన్ చేసి ఉల్లంఘనల ఫొటో, వీడియో, ఆడియోను యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయాలి. ఎన్నికల నియమావళి ప్రకారం ఫిర్యాదుదారుని వివరాలు గోప్యంగా ఉంచుతారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, మత్తు పదార్థాలు, డబ్బు, ఇతర వస్తు సామగ్రి పంపిణీ, ఓటర్ల తరలింపు, అనుమతి లేకుండా వాహనాల వినియోగం, గడువు ముగిసిన తర్వాత ప్రచారం, ఓటర్లను భౌతికంగా, మానసికంగా భయపెట్టడం తదితరాలపై ఫిర్యాదు చేసుకునే వీలుంటుంది.

అందుబాటులో టోల్ఫ్రీ నంబరు 1950

షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు (ఎంసిసి) బృందాలు రంగం లోకి దిగాయి. ఎక్కడైనా, ఎవరైనా నియమావళిని అతిక్రమిస్తుంటే.. ఈ బృందాల దృష్టికి తీసుకురావచ్చు. అందుకోసం 1950 టోల్ ఫ్రీ నంబరును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా వెళ్లే ఫిర్యాదులను జాతీయ, రాష్ట్రస్థాయిలో రోజూ సమీక్షిస్తారు. దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయొచ్చు. 22 భాషలకు సహకరిస్తుంది. భాషను ఎంచుకుని ఫిర్యాదు చేయడంతో పాటు దరఖాస్తులకు సంబంధించిన విజ్ఞప్తులు, ఓటరు లిస్టులో మీ పేరు ఉందో? లేదో? చూసుకోవచ్చు. అప్‌లోడ్ చేసిన ఫిర్యాదుపై వంద నిమిషాల వ్యవధిలో చర్యలు తీసుకునేలా యాప్ రూపొందించారు. మొదటి అయిదు నిమిషాల్లో జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందిస్తారు. తర్వాత 15 నిమిషాల వ్యవధిలో తనిఖీ బృందం సంబంధిత ప్రాంతానికి చేరుకుంటుంది. అనంతరం 30 నిమిషాల వ్యవధిలో ఫిర్యాదుపై చర్యలకు సిఫార్సు జరుగుతుంది. 50 నిమిషాల వ్యవధిలో రిటర్నింగ్ అధికారి ఫిర్యాదును పరిష్కరిస్తారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకునేలా ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం చేపడుతోంది.




నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలు నెలరోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలను వర్చువల్ విధానంలో గుర్తించి జాబితాలను సోమవారం విడుదల చేశారు. రాష్ట్రస్థాయి వర్చువల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎం.గేయానంద్, కుర్రా రామారావు, విద్యా విభాగం రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ విజేతల జాబితాను విడుదల చేశారు. వర్చువల్ సమావేశంలో గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, హేతుబద్ధతను, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు సైన్స్ ప్రయోగాల వీడియో కంటెస్టుని నిర్వహించినట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ద్వారా విద్యా విషయక కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నాయకులు మహేష్, వీడియో కంటెస్టు న్యాయ నిర్ణేతలు ఎమ్మెస్ యుగంధర్‌బాబు, కెఎస్ జిలాని బాషలు పాల్గొన్నారు. శ్రీకాకుళం నుంచి జెవివి విద్యా విభాగం సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జిల్లాల్లో మొదటి రెండు స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని అన్నారు. దేశంలో ఆశాస్త్రీయ భావాలు పెరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయ దృక్పథం పెంచే కృషిలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కోరారు. వీడియో పోటీల్లో ప్రథమ బహుమతి కర్నూలు జిల్లా భాష్యం స్కూల్ విద్యార్థులు స్నేహిత అమూల్య ప్రణీత, ద్వితీయ బహుమతి శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం డి.బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.చరణ్‌తేజ, తృతీయ బహుమతిని పల్నాడు జిల్లా ఇప్పుడు మండలం బొగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.చెన్నకేశవ దక్కించుకున్నట్టు తెలిపారు.

24 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన యువకులు

పాతపట్నం: గజపతి జిల్లా పర్లాకిమిడి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, తరలిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేశామని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ సోమ వారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం మోహన్ బ్లాక్ పరిధిలోని ఆడవకి చెందిన నలుగురు యువకులు 24 కేజీల గంజాయి తరలిస్తున్నారని అన్నారు. సమాచారం తెలిసిన వెంటనే తన సిబ్బందితో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టామని అన్నారు. ఈ తనిఖీలో గంజాయి పట్టుబడిందని అన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అక్రమంగా తరలిస్తున్న నలుగురినీ అరెస్టు చేశామని తెలిపారు. నలుగురినీ నరసన్నపేట కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. దీని విలువ రూ.1.20 ఉంటుందని అంచనా వేశామని తెలిపారు.


పార్టీలో చేరిన వారితో మంత్రి అప్పలరాజు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

మంత్రి కార్యాలయంలో సోమవారం మందస మండలం బహాడపల్లి, లింబుగాంకు చెందిన మాజీ సర్పంచ్ బొడ్డు హరికృష్ణతో పాటు పలువురు నాయకులు వైసిపిలో చేరారు. వారికి మంత్రి సీదిరి అప్పలరాజు వైసిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అగ్గున్న సూర్యారావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాస్, బహాడపల్లి సర్పంచ్ బొడ్డు ఉదయ్ కుమార్, మామిడి తులసయ్య, మామిడి కృష్ణ పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, శిరీష

పలాసలో టిడిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషను సోమవారం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో కోసంగి పురం జంక్షన్ వద్ద ఎంపీ రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీషకు స్వాగతం పలికారు. అక్కడ నుంచి మొగిలిపాడు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మాజీ కౌన్సిలర్ వజ్జ గంగా భవాని, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, సురేష్ బాబు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, బావన దుర్యోధన పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి కృష్ణచైతన్య

ప్రచారానికి సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 27న ప్రారంభం కానున్న ఎన్నికల ప్రచారానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య కోరారు. సోమవారం మండలంలో దాసన్న ఎన్నికల ప్రచార సంసిద్ధత సమావేశం వెదుళ్లవలసలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బూటకపు ప్రచారాన్ని నమ్మొద్దని, లేనిది ఉన్నట్లు చూపించే కనికట్టు ప్రచారానికి తెరలేపుతారని, టిడిపి అబద్ధపు ప్రచారానికి ధీటుగా సమాధానం చెప్పడానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ బైరాగినాయుడు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, వైస్ ఎంపిపిలు కోట అప్పారావు, కె.తాతారావు, ధర్మాన లక్ష్మణదాస్, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు పాల్గొన్నారు.


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న గాంధీ

గాంధీ ప్రచారం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై అవినీతి, అక్రమార్జనే లక్ష్యంగా పరిపాలన సాగించిన నాయకులకు స్వస్తి పలికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని వైసిపి రెబల్, స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ ప్రజలను కోరారు. సోమవారం సరుబుజ్జిలి మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో ప్రధాన రహదారి, నందికొండ, దుబ్బులపేట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ ఇంటింటికి వెళ్లి నియోజకవర్గంలో గత కొంతకాలం నుంచి నడుస్తున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడి ఆమదాలవలస అభివృద్ధి కోసం తనకు ఒక అవకాశం కల్పించి అవినీతి నాయకులకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సువ్వారి సత్యనారాయణ, పేడాడ వైకుంఠరావు, రాజశేఖర్, అనిల్, నేతాజీ, అప్పలనాయుడు, పాపారావు, శ్రీను, ఈశ్వరరావు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న డాక్టర్ గంగాధరరావు

ఆధునిక సౌకర్యాలతో శివం థెరపీ సెంటర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు, మానసిక వైకల్యం ఉన్న రోగులకు థెరఫీ ద్వారా వైద్యం అందించేందుకు వీలుగా నగరంలోని బలగ మెట్టు సత్యసాయినగర్‌లో శివం థెరఫీ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ గొండు గంగాధరరావు, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌లు ప్రారంభించారు. ఆధునిక వైద్య పరికరాలను, సౌకర్యాలను అందుబాటులోకి తీసుకుకొచ్చి ఈ కేంద్రంలో చికిత్స నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తినే ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన లోపాలు వల్ల ప్రస్తుతం అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. అందులో చిన్నతనంలో పిల్లలకు అంగవైకల్యం రావడం వల్ల జీవితాంతం ఇంకొకరిపై ఆధారపడి జీవించాల్సిన అవసరం వస్తుందన్నారు. అటువంటి వారికి 2020లో నగరంలో శివం థెరఫీ సెంటర్ ద్వారా డాక్టర్ కళ్యాణ చక్రవర్తి సేవలను ప్రారంభించి అనేక మందికి సాధారణ స్థితికి తీసుకురాగలిగారని తెలిపారు.

రేపు కళాకారుల దినోత్సవం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 27న పట్టణంలో రైల్వేస్టేషన్ ఆవరణలో జరిగే ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని రంగస్థల కళాకారుల సంఘం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో భాగంగా శశిరేఖ పరిణయం నుంచి ఒక సీను, సత్య హరిశ్చంద్ర నాటకం నుంచి కాటి సీను ప్రదర్శించ బడతాయన్నారు. ఈ కార్యక్రమానికి కళాకారులు, కళాభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వైసిపి ఇంటింటా ప్రచారం


పొందూరు : ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించాలని ఆమదాలవలస వైసిపి అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మరలా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరొక అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈయన వెంట రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు), జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారు జై ప్రతాప్ కుమార్, వైసిపి నాయకులు గుడ్ల మోహన్, అనకాపల్లి గోవింద్ పాల్గొన్నారు.

బూర్జ: మండలం తమ్మిపేట గ్రామంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి నాగు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు, వైస్ ఎంపిపిలు కరణం కృష్ణంనాయుడు, సూర్యారావు, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, డిసిఎంఎస్ మెంబర్ జల్లు బలరాం నాయుడు, ఎంపిటిసి గుమ్మిడి రాంబాబు, సర్పంచ్ సుదిష్ణ సత్యనారాయణ పాల్గొన్నారు.

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గెలుపు ఖాయమని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ అన్నారు. మండలం టెక్కలిపట్నం, చిన్నంచల పంచాయతీల్లో సోమవారం వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచరాన భాస్కరరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి మచ్చ ధనరాజ్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ మాధవరావు, ఎంపిటిసి బమ్మిడి దుర్యోధనరావు, వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గొర్లె వేణుగోపాల్ పాల్గొన్నారు.


బూర్జ : సంక్షేమ పథకాలను వివరిస్తున్న చిరంజీవి నాగు


పలాస : టెక్కలిపట్నంలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

'సూపర్ సిక్స్‌పై' ప్రచారం

ప్రజాశక్తి- బూర్జ

మండలం డొంకలపర్తలో టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సోమవారం శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ టిడిపికి ఓటు వేసి రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడాలన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని, తద్వారా అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి స్కీంల పేరిట స్కేమ్‌లు చేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టారని మండిపడ్డారు. శ్యాండ్, ల్యాండ్, మద్యం పేరిట సిఎం జగన్మోహన్ రెడ్డి అడ్డగోలుగా ప్రజాధనాన్ని లూటీ చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణనాయుడు, జనసేన నాయకులు కొల్ల జయరాం, సేనాన రమేష్, అనంతరావు, సత్యనారాయణ, దిలీప్, బిజెపి నాయకులు పేరాడ సూరపు నాయుడు, మండల అధ్యక్షులు పిల్లా జగన్, వేలపల్లి గోవిందరావు పాల్గొన్నారు.

నందిగాం: సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధితో పాటు సంక్షేమం అందించడంలో టిడిపి ముందుంటుందని టిడిపి నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని పోలవరం, దిమ్మిలాడ, మాలపేట గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పి.అజయ్ కుమార్, ఎం.బాలకృష్ణ, ఎం.సింహాచలం, కె.తాతయ్య పాల్గొన్నారు.


బూర్జ : వృద్ధురాలితో మాట్లాడుతున్న రవికుమార్


నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు, గ్రామైఖ్య సంఘ సభ్యులు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నందిగాం

ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎంపిడిఒ జి.శివప్రసాద్ కోరారు. సోమవారం మండలంలో కొండ తెంబూరు, కొత్తగ్రహారం, బడగాం, జద్యాడ, కె.కె.పురం గ్రామాల్లో ఓటుహక్కుపై అవగాహన సదస్సులతో పాటు ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం జాంబవతి, వెలుగు సిబ్బంది, గ్రామైఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టెక్కలిరూరల్: ఓటుహక్కు వినియోగంపై వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలో తిర్లంగి పంచాయతీ వీరు రామకృష్ణపురంలో అవగాహన ర్యాలీలు, మానవహారం నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటర్లు విధిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం గురువెల్లి నారాయణరావు, సిసిలు పద్మ, నీలవేణి, వరదరాజులు, గ్రామైఖ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘ సభ్యులు


మాట్లాడుతున్న సుదర్శన్ దొర

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో తక్కువ శాతం పోలింగ్ జరిగిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అధిక శాతం పోలింగ్ జరిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో 85 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. 200 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సరిహద్దు చెక్‌పోస్ట్‌లో గట్టి నిఘా పెట్టామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,313 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రచారాలకు ముందుస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిటి శ్రీహరి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న చిన్నారులు, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు

చిన్నారులకు దాతృత్వం అలవర్చాలి

కవిటి : పిల్లలకు చిన్నతనం నుంచే దాతృత్వం అలవర్చాలని హెల్పింగ్ హేండ్స్ సభ్యుడు కాశీ సాహు అన్నారు. ప్రగడపుట్టుగకు చెందిన ఓ దాత సహాయంతో సోంపేట, కంచిలి మండలాల పరిధిలో రోడ్డుపక్కన ఉండే అభాగ్యులకు హెల్పింగ్ హేండ్స్ సభ్యుల సహకారంతో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులను కూడా భాగస్వామ్యులను చేసిన హెల్పింగ్ హేండ్స్ సభ్యులు వారికి దాతృత్వంపై అవగాహన కల్పించారు. చిన్నారులు కార్తీక్, పవన్, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు నరసింహ, శ్యామ్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు: మండలం వావిలపల్లిపేట వద్ద ఎపి మోడల్‌స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150, ఒసి, బిసి, ఇడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తు కాఫీని, అర్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాఫీలను జతచేసి పాఠశాలలో అందజేయాలని పేర్కొన్నారు.

మందకృష్ణ నిజస్వరూపం బయటపడింది

శ్రీకాకుళం అర్బన్: చంద్రబాబుతో జత కట్టేందుకు వెళ్లిన మందకృష్ణ సిగ్గుపడాలని, గతంలో ఎస్‌సిగా పుట్టాలని ఎవరైనా అనకుంటారా అన్న వ్యక్తితో ఎలా అంటకాగుతారని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నో ఓబులేష్ అన్నారు. వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్వప్రయోజనాల కోసమే ఎస్‌సిలను మోసం చేసేందుకు మంద కృష్ణ మాదిగ మరోసారి సిద్ధమయ్యారని ఆరోపించారు. ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పొన్నాడ రుషి, బత్తిలి శ్యామ్‌సుందర్, కల్లేపల్లి రాంగోపాల్, గోవింద్, కొమ్ము గురువులు పాల్గొన్నారు.

జగన్ అరాచకాలకు అంతే లేదు


కవిటి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: జగన్మోహన్ రెడ్డి అరాచకాలకు అంతేలేదని, దానికి ముగింపు పలికే సమయం ఆసన్నమైందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. మండలం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే నివాసం వద్ద సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ టిడిపి హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఎపిని జగన్ గంజాయి, డ్రగ్స్ రవాణాలో నెంబర్ వన్ స్థానానికి తీసుకొచ్చారని ఆరోపించారు. విశాఖను స్టేట్ కేపిటల్ చేస్తానని డ్రగ్స్ కేపిటల్ చేశారని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడ గంజాయి లభ్యమైనా దాని మూలాలు ఎపిలో ఉంటున్నాయన్నారు. తాడేపల్లి కనుసన్నల్లోనే డ్రగ్స్ దందా సాగుతోందన్నారు. మరోవైపు సిఎం సొంత జిల్లాలో వైసిపి నాయకుల భూ కబ్జాలకు ఓ నిండు చేనేత కుటుంబం బలైందని ఎమ్మెల్యే ఆరోపించారు. సమావేశంలో టిడిపి నాయకులు బెందాలం రమేష్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పాతపట్నం: రాష్ట్రాన్ని డ్రగ్ అడ్డాగా వైసిపి మార్చేసిందని పాతపట్నం కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'యువతరం' ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

హిమోపిలియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ఈరోతు వితిక (18 నెలలు)కు యువతరం సేవాసమితి సభ్యులు ఆర్థికసాయం అందించారు. సోమవారం పెద్ద సమ్మాదేవిలో చిన్నారి తల్లి జ్యోతిని కలిసి సంస్థ తరుపున రూ.15వేల చెక్కును అందజేశారు. నాలుగు నెలల వయసులోనే మెదడులో రక్తం గడ్డ కట్టడం వలన చిన్నారికి మెదడు శస్త్ర చికిత్స చేశారు. హిమోఫిలియా(చిన్న గాయం అయినా కూడా రక్తం ఆగకుండా కారడం)అనే ఒక నయం కాని చాలా అరుదైన జన్యుపరమైన వ్యాధితో ప్రతి నెల మూడుసార్లు రక్త మార్పిడి చేయాల్సి వస్తుంది. వైద్యానికి నెలకు సుమారు రూ.8 వేలు నుంచి రూ.15 వేలు వరకు ఖర్చు అవుతుందని తండ్రి ఈరోతు రామారావు తెలిపారు. ఈయన హైదరాబాద్‌లో వలస కార్మికుడుగా పని చేస్తున్నారు. తల్లి స్వగ్రామంలో రోజు కూలీగా పని చేస్తుంది. వైద్యానికి ఆర్థిక స్తోమత చాలక దాతలసాయం అర్జించారు. స్పందించి యువతరం సేవాసమితి సభ్యులు దాతల ద్వారా విరాళాలు సేకరించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు చింత మురళీ, ఉపాధ్యక్షులు లింగరాజు, ఇన్‌ఛార్జిలు అన్నెపు లక్ష్మణరావు, బత్తిని విఘ్నేశ్వరరావు, కోడి నిహల్, రవి పంతులు, దుర్గారావు, చొక్కార గురుమూర్తి పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఎలుగు బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ కోరారు. ఇటీవల ఎలుగు దాడిలో మరణించిన అనకాపల్లి గ్రామానికి చెందిన జీడి రైతులు చీడిపల్లి మోహనరావు, అప్పికొండ కూర్మారావు కుటుంబ సభ్యులను సోమవారం రైతు సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లగా ఎలుగు దాడుల్లో రైతులు మరణిస్తున్నా, తూతూ మంత్రంగా అరకొర చర్యలు తప్ప, శాశ్వత ప్రాతిపదికన శాఖపరమైన చర్యలు అటవీశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రతినిధులు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఎలుగు దాడి మరణాలు, అటవీశాఖ హత్యలేనని విమర్శించారు. మెట్టూరు ఎంపిటిసి కొండప్ప సురేఖ మాట్లాడుతూ ఇటీవల నల్లబొడ్లోలూరు కొండ ప్రాంతం కంకర మైనింగ్ జరిపి, అక్రమానికి గురికావడంతో వన్యప్రాణులకు వెసులుబాటు లేక జనావాసాలపై దాడులు పెరగాయన్నారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు కుత్తుం వినోద్ కుమార్, సతుపల్లి కృష్ణారావు, కోనేరు గురయ్య, బైపల్లి రామకృష్ణ నాయుడు, సూరాడ జోగారావు పాల్గొన్నారు.

వేసవి పంటలతో నేలకు మేలు

రణస్థలం: రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట అనంతరం పొలాలను ఖాళీగా ఉంచకుండా వేసవి పంటలు వేయడం వలన భూగర్భ జలాలు ఆవిరి కాకుండా కాపాడవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని వెంకటరావుపేట, వెంకటేశ్వర కాలనీలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వేసవి పంట విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపం పెరిగి పోతున్న ప్రస్తుత తరుణంలో వేసవిలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతున్నాయని, వేసవి దుక్కుల పేరిట నేలను పలుమార్లు దున్నడం వలన నేలలోని తేమ ఆవిరైపోవడమే కాకుండా, నేలలోని ఉపయోగకర సూక్ష్మ జీవులు కూడా కనుమరుగై పోతాయన్నారు. దీని నివారణకు పొలం అంతా ఏదోఒక స్వల్ప కాలిక, వేసవి అనుకూల ఆచ్ఛాదన పంటతో నేలను కప్పి ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. వేసవిలో పప్పు ధాన్యాలు, నూనె గింజల వంటి ఆచ్ఛాదన పంటల వలన నేలకు పోషకాలు అంది నేల సారవంతం అవుతుందని, అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చున్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ పి. తవిటినాయుడు, గ్రామ పెద్దలు, యువత, రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది ఎస్.పి.నారాయణరావు, పి.రమణ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక అవస్థలు

మెళియాపుట్టి: మండలంలోని పలాస రహదారిలో శేఖరాపురం పంచాయతీ బురద రామచంద్రపురం, జాడుపల్లి పంచాయతీ ఎగువ జాడుపల్లి, బాణాపురం పంచాయతీ పదనాపురం కూడళ్ల వద్ద బస్సుషెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం వేచి ఉండే సమ యంలో ఎండలకు, వర్షాలకు చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. పాలకులు స్పందించి ప్రయాణికులకు విశ్రాంతి భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.


బస్సుషెల్టర్ లేని బురద రామచంద్రాపురం జంక్షన్


మాట్లాడుతున్న కూన రవికుమార్

అభ్యర్థుల విజయానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సమిష్టి కృషి చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. నగర శివారుల్లోని కొత్తరోడ్డు వద్ద గల ఎస్ కన్వెన్షన్‌లో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలతో సమన్వయ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికార పార్టీ వైసిపికి బుద్ధి చెప్పేలా సమిష్టిగా పనిచేయాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా ప్రతి నిమిషమూ విజయలక్ష్యంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమా మహేశ్వరరావు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులు గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, పేడాడ రామ్మోహనరావు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురంకు చెందిన చింతాడ చెల్లమ్మ (46) పాముకాటుతో సోమవారం మృతి చెందింది. మృతురాలు చెల్లమ్మ ఈ నెల 17న కొంత మంది కూలీలతో కలిసి మినపచేను తీస్తుండగా విషసర్పం చేతిమీద కాటు వేసింది. వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యంకోసం 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ మేరకు మృతురాలు కుమారుడు చింతాడ దుర్గారావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్ మహ్మద్అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


పాతపట్నం : వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

పాతపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తెంబూరులో వై.జంక్షన్ వద్ద సోమవారం ఫ్లైయింగ్ స్క్వాడ్, పాతపట్నం పోలీస్ సిబ్బంది కలిసి పలు వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్: ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు ఎన్నికల నేపథ్యంలో నగరంలోని వివిధ కూడళ్లలో సోమవారం వాహనాల రాకపోకలను పరిశీలించి అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. 80 ఫీట్ రోడ్డులో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు హెల్మెట్ దరించడం, వాహనాలతో పాటు అన్ని ధ్రువపత్రాలూ కలిగి ఉండడం తప్పనిసరని అన్నారు. అనంతరం హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతం చేయాలని కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు ఒక ప్రకటనలో కోరారు. బస్సు యాత్ర ద్వారా గత ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తారని అన్నారు. 98 శాతం హామీలను నెరవేర్చారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా డోలోత్సవం

కవిటి: మండలం బెజ్జిపుట్టుగ జన సందోహంగా మారింది. చక్ర పెరుమాళ్ స్వామి డోలోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం జరిగిన జాతరకు యాత్రికులు పోటెత్తారు. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు ఒడిశా నుంచి యాత్రికులు తరలివచ్చారు.

రామ్‌చరణ్ అభిమానుల అన్నదానం

శ్రీకాకుళం అర్బన్ : సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమాన సంఘం ఆధ్వర్యాన ఏడు రోడ్ల కూడలి వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరంజీవి అభిమాన సంఘం నాయకులు తైక్వాండో శ్రీను, ఎం.సుధీర్‌వర్మ, టంకాల కృష్ణలు ప్రారంభించారు. కార్యక్రమంలో న్యూటీషనిస్ట్ నాగరాజు, షేక్ అబ్దుల్లా, నాయుడు, బాలు, వాసు, గౌతమ్, సిద్ధూ పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

సోంపేట: స్థానిక ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి, బారువ గ్రామ పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థి సంఘ భవనం వద్ద హెల్ప్ ఏజ్ ఇండియా సౌజన్యంతో బుధవారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరానికి వైద్య బృందం విచ్చేసి గ్రామంలో నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి, ఉచిత మందుల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఆపరేషన్ అవసరమయ్యే వారికి సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందని, ఈ శిబిరాన్ని బారువా, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బలహీన వర్గాలకు రక్షణ కరువు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రక్షణ కరువైందని శ్రీకాకుళం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలిలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహనరెడ్డి సొంత జిల్లాలో భూముల రికార్డులను తారుమారు కావడంతో మనస్తాపానికి గురై చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. పాండ్రంకి శంకర్, రెడ్డి గిరిజాశంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, నాగేంద్ర యాదవ్, మూకళ్ల శ్రీను, దేశెల్ల విస్సు, సత్యం, రమణ, గొండు చిన్నారావు, శ్యామసుందరరావు, మధు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గొండు శంకర్